AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
WWW.AKSHARATODAYNEWS.COM
16-7-2026 (Thursday) MAIN EDITION

## నీట్ పేపర్ లీక్‌లో సంచలన నిజాలు




**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** నీట్ యూజీ 2026 పరీక్షా పత్రం లీకేజీ కేసులో నిందితుడిగా ఉన్న కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు శివరాజ్ రఘునాథ్ మోటేగావ్‌కర్ బెయిల్ పిటిషన్‌ను వ్యతిరేకిస్తూ సీబీఐ ప్రత్యేక కోర్టుకు కీలక నివేదికను సమర్పించింది. మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన శివరాజ్, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ప్రశ్నపత్రాల రూపకల్పన కమిటీలో సభ్యుడిగా ఉన్న పీవీ కులకర్ణి ద్వారా ప్రశ్నపత్రాలను సేకరించినట్లు తేలింది. కులకర్ణి కోచింగ్ సెంటర్‌లో శివరాజ్ కుమారుడు చదువుతుండటంతో, వారిద్దరి మధ్య ఉన్న పరిచయంతోనే ఈ లీకేజీకి పాల్పడినట్లు సీబీఐ గుర్తించింది.

## గోదావరి నీటిని పూర్తిస్థాయిలో వినియోగిస్తాం: భట్టి



**అక్షరటుడే, కొత్తగూడెం :** గోదావరి నదిలోని ప్రతి నీటి చుక్కను గ్రావిటీ, లిఫ్ట్ సిస్టమ్స్ ద్వారా పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో నిర్మాణంలో ఉన్న సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పరిశీలించారు. భట్టి మాట్లాడుతూ.. గోదావరి జలాల వినియోగ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించామని, స్వయంగా క్షేత్ర స్థాయికి వెళ్లి ఇరిగేషన్ ప్రాజెక్టులను సమీక్షిస్తున్నట్లు తెలిపారు.

## కనుల పండువగా జగన్నాథ రథయాత్ర



అక్షరటుడే, ఒడిశా : ఒడిశాలోని పూరీలో జగన్నాథుని రథయాత్ర కనుల పండువగా సాగుతోంది. యాత్రను వీక్షించడానికి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్రా దేవి తమ రథాలపై ఆసీనులయ్యారు. ప్రస్తుతం పూరీలో భారీ వర్షం కురుస్తుండటంతో జగన్నాథ స్వామిని కిరీటం లేకుండానే బయటకు తీసుకువచ్చారు.

## గురుకుల విద్యార్థినుల ఆందోళన



అక్షరటుడే, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గాంధీనగర్ సోషల్ వెల్ఫేర్ బాలికల గురుకుల పాఠశాల ఎదుట విద్యార్థినులు ఆందోళన చేపట్టారు. నెల రోజులుగా తాగునీటి సమస్యతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. వాష్‌రూమ్‌లు, బాత్రూమ్‌లలో నీరు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు.

## టీపీసీసీ కీలక నిర్ణయం..

అక్షరటుడే, హైదరాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) పార్టీ కార్యక్రమాల్లో పాలాభిషేకం, జలాభిషేకం నిర్వహించడాన్ని నిషేధించింది. ఆహార వనరులను వృథా చేసే ఆచారాలకు బదులుగా, ఇకపై పోషకాహార లోపంతో బాధపడుతున్న వారికి ఆహారాన్ని పంపిణీ చేసే కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించింది.

## డ్రగ్స్ కేసులో ఎమ్మెల్సీ కుమారుడి అరెస్ట్!



**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ :** హైదరాబాద్ నగరంలో మాదకద్రవ్యాల సరఫరా, వినియోగంపై పోలీసులు నిర్వహిస్తున్న ఉక్కుపాదం దాడులు కీలక మలుపు తిరిగాయి. మంగళహాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మెరుపు దాడుల్లో ఎమ్మెల్సీ కుమారుడు భరత్ డ్రగ్స్ కేసులో పోలీసులకు చిక్కడాని సమాచారం. ఈ కేసులో ఎమ్మెల్సీ కుమారుడు భరత్ కూడా డ్రగ్స్ ముఠాతో సంబంధాలు కలిగి ఉన్నాడని, స్వయంగా పాల్గొంటున్నాడని ప్రాథమికంగా గుర్తించి అరెస్టు చేశారని తెలిసింది. అయితే తన కుమారుడు అరెస్ట్ కాలేదని, డ్రగ్స్ తీసుకోలేదని ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి తెలిపారు. ఇతరుల ఫోన్ లిస్ట్‌లో తన కుమారుడి నంబర్ ఉండటంతో పోలీసులు వచ్చి విచారణ జరిపారన్నారు.

## చమురు ధరలపై కేంద్రం కీలక నిర్ణయం..



**అక్షరటుడే, ఢిల్లీ :** దేశీయంగా ఇంధన లభ్యతను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధానంగా రిఫైనరీలు స్థానిక మార్కెట్‌ను పక్కన పెట్టి, విదేశాలకు ఇంధనాన్ని ఎగుమతి చేయడం ద్వారా భారీ లాభాలు గడించకుండా నిరోధించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. ఈ చర్యలో భాగంగా కేంద్రం పన్నుల వ్యవస్థలో మార్పులు చేసింది. డీజిల్ , విమాన ఇంధనం (ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్) ఎగుమతులపై విధిస్తున్న అదనపు పన్నును లీటర్‌కు రూ. 7 మేర పెంచింది. దీనితో పన్ను రూ. 8.5 నుండి రూ. 15.5కి పెరిగింది. వినియోగదారులకు కొంత ఊరటనిచ్చేలా, పెట్రోల్ ఎగుమతులపై ఉన్న పన్నును లీటర్‌కు రూ. 4 నుండి రూ. 2.5కి తగ్గించింది.



# గోల్కొండలో బోనాల సందడి

**హైదరాబాద్ నగరంలో బోనాల సందడి మొదలైంది. గోల్కొండ కోటలో కొలువైన జగదాంబిక అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పించారు. నెల రోజుల పాటు సాగే ఆషాఢ బోనాలు గోల్కొండతో గురువారం ఘనంగా ప్రారంభం అయ్యాయి. అమ్మవారి దర్శనానికి భక్తులు భారీ ఎత్తున తరలి వచ్చారు. మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



■ నగరంలో ప్రారంభమైన ఆషాఢ బోనాలు ■ అమ్మవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు ■ పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు

గోల్కొండ కోట జగదాంబిక అమ్మవారికి తొలి బోనంతో ఆషాఢ బోనాల ఉత్సవాలు ప్రారంభం అయ్యాయి. ఆషాఢ మాసంలో వచ్చే తొలి గురువారం లేదా ఆదివారం గోల్కొండ బోనాలు నిర్వహిస్తారు. బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని లంగర్ హౌజ్ చౌరస్తాలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఉత్సవ వేదిక వద్దకు చేరుకున్న మంత్రిగారికి అర్చకులు మంత్రోచ్చారణలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు. హైదరాబాద్ ఇంఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌తో కలిసి ఆమె అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. బోనాల ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకుని డప్పు చప్పుళ్ళు, పోతురాజుల విన్యాసాలు, కళాకారుల సాంస్కృతిక ప్రదర్శనల నడుమ శివసత్తులతో కలిసి అమ్మవారికి తొలి బోనం సమర్పించి, మొక్కులు చెల్లించుకున్నారు.

### భక్తులతో కోలాహలం

నిత్యం పర్యాటకులతో సందడిగా ఉంటే గోల్కొండ కోట.. నేడు భక్తులతో కళకళలాడుతోంది. కోటలో కొలువైన జగదాంబిక అమ్మవారికి బోనాలు సమర్పించడానికి భక్తులు తరలివచ్చారు. తల్లికి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. తొట్టెలను పోతురాజుల విన్యాసాలతో గోల్కొండ కోటపై ఉన్న జగదాంబిక ఎల్లమ్మ మహంకాళి ఆలయానికి తీసుకెళ్లారు.

### రూ.11 లక్షలు అందజేత

ఆషాఢ బోనాల ఉత్సవాల బుక్ లెట్‌ను మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ ఆవిష్కరించారు. జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరపున రూ. 11 లక్షల చెక్కును అందజేశారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక వారసత్వానికి ప్రతీకగా నిలిచే బోనాల పండుగను రాష్ట్ర ప్రభుత్వం అత్యంత వైభవంగా నిర్వహిస్తోందన్నారు. ఎల్‌నినో ప్రభావం తగ్గి, భూతల్లి శాంతించి సమృద్ధిగా వర్షాలు కురవాలని ఆకాంక్షించారు. బోనాల ఉత్సవాన్ని పురస్కరించుకుని పెద్ద దేవాలయాతో పాటు, చిన్న చిన్న గుడులకు కూడా నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి స్పష్టం చేశారు.

## పిల్లల మనసుల్లో మతచిచ్చు : బండి సంజయ్




**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ సైదాబాద్‌లోని 'సక్సెస్' ప్రైవేట్ పాఠశాలలో హిందూ విద్యార్థులకు కల్మా, సురా ఫతేహా చదవాలని హోంవర్క్ ఇచ్చిన ఘటనపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా స్పందించారు. హిందూ సంస్కృతిపై జరుగుతున్న ఈ దాడిని ఆయన తప్పుబట్టారు. పిల్లల మనసుల్లో మతపరమైన అంశాలను రుద్దడం చాలా దుర్మార్గమని మండిపడ్డారు. ఇలాంటి ఘటనలను సమాజం ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. ముఖ్యంగా, 'సెక్యులర్' వాదులు దీనిపై ఎందుకు నోరు మెదపడం లేదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు హిందూ విద్యార్థులందరికీ బొట్టు తప్పనిసరి చేస్తామన్నారు.

## తేనెటీగల పెంపకానికి మంత్రి సీతక్క శ్రీకారం

**అక్షరటుడే, ములుగు :** ములుగు జిల్లా తాడ్వాయి మండలం గౌనెపల్లిలో మహిళా సాధికారత దిశగా సరికొత్త అడుగు పడింది. 'ఇందిరా మహిళాశక్తి' జీవనోపాధుల కార్యక్రమంలో భాగంగా, హంబుల్ బీ సంస్థ సహకారంతో మహిళా సంఘాలకు శాస్త్రీయ పద్ధతిలో తేనెటీగల పెంపకంపై ప్రత్యేక శిక్షణను మంత్రి సీతక్క ప్రారంభించారు. నేటి ఆధునిక కాలంలో అలవాటైన ప్లాస్టిక్ ప్లేట్ల వినియోగం వల్ల క్యాన్సర్ వంటి భయంకరమైన వ్యాధుల బారిన పడుతున్నామని ఆందోళన వ్యక్తం చేశారు. పూర్వకాలపు జీవనశైలి నేడు బంగారంతో సమానమని పేర్కొన్న ఆమె, మోదుగ ఆకులు, ఇప్పపువ్వు, సహజ సిద్ధమైన తేనె వంటివి ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని తెలిపారు.



## స్కూళ్లలో మతపరమైన బోధనలు




**అక్షరటుడే, హైదరాబాద్ :** హైదరాబాద్ సైదాబాద్‌లోని 'సక్సెస్' అనే ప్రైవేట్ పాఠశాలలో మతపరమైన బోధనలు చేయడం తీవ్ర వివాదానికి దారితీసింది. హిందూ విద్యార్థులకు 'కల్మా', 'సురా ఫతేహా' చదవాలని హోంవర్క్ ఇవ్వడంపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. స్కూల్ డైరీలో కల్మా చదవాలని హోంవర్క్ ఇచ్చిన విషయాన్ని గమనించిన తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్యాన్ని నిలదీశారు. తమ పాఠశాలలో ఇది తప్పనిసరి అని యాజమాన్యం సమాధానం ఇవ్వడంతో వివాదం మరింత ముదిరింది. వెంటనే బీజేపీ నేతలతో కలిసి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన నేపథ్యంలో బీజేపీ నేతలు పాఠశాలను ముట్టడిస్తామని హెచ్చరించడంతో, పోలీసులు భారీగా చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు.

## వైసీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం



**అక్షరటుడే, అమరావతి:** వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో వైఎస్ జగన్ అధ్యక్షతన పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. త్వరలో జరగనున్న పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో ఉభయ సభల్లో పార్టీ అనుసరించాల్సిన వ్యూహం, ప్రస్తావించాల్సిన ప్రజా సమస్యలు, రాష్ట్ర ప్రయోజనాలు తదితర అంశాలపై చర్చించి పలు సూచనలు చేశారు.



## మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కేసు

**అక్షరటుడే, ఏపీ :** మాజీ మంత్రి అంబటి రాంబాబుపై కిర్లంపూడి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ముద్రగడ పద్మనాభం అంత్యక్రియల సందర్భంగా పోలీసుల విధులకు ఆటంకం కలిగించారని, సిబ్బందిని నెట్టివేశారని ఆయనపై కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు. ముద్రగడ అంత్యక్రియలను ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ముద్రగడ కుటుంబ సభ్యులు దీనిని తిరస్కరించారు. అంత్యక్రియల సమయంలో గార్డ్ ఆఫ్ హానర్ ఇస్తున్న తరుణంలో అంబటి రాంబాబు, మరికొందరు వైసీపీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆ సమయంలో తమను నెట్టివేయడంతో పాటు విధులకు ఆటంకం కలిగించారని ఏఆర్ ఎస్సై అప్పలరాజు, కానిస్టేబుళ్లు ఫిర్యాదు చేశారు.

## పడవలు మునిగి 500 మందికిపైగా మృతి

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** బంగాళాఖాతంలో జరిగిన ఘోర పడవ ప్రమాదంలో 500 మందికి పైగా మయన్మార్ దేశానికి చెందిన వలసదారులు (రోహింగ్యా శరణార్థులు) ప్రాణాలు కోల్పోయి ఉంటారని అంతర్జాతీయ సంస్థలు తెలిపారు. మయన్మార్‌లోని రాఖైన్ రాష్ట్ర తీరం నుంచి బయలుదేరిన రెండు పడవలు సముద్రంలో మునిగిపోవడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. జూన్ చివరలో రాఖైన్ తీరం నుంచి ఈ రెండు పడవలు ప్రయాణాన్ని ప్రారంభించాయి. వీటిలో మయన్మార్ నుంచి వస్తున్న రోహింగ్యాలతో పాటు, బంగ్లాదేశ్‌లోని శరణార్థి శిబిరాల నుంచి వచ్చిన వారు కూడా ఉన్నారు.

